# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### ❖ టార్చిలైట్లు కొనుడే అయితది..

ఖానాపూర్, నవంబర్ 25: కాంగ్రెసోళ్లు చెప్పింది వింటే మళ్లీ టార్చిలైట్లు కొని పొలాల పంట రాత్రి పూట కావలా పోవుడే అయితది. వీళ్లకు రైతుల విలువ తెల్వదు. కాంగ్రెసోళ్ల పెద్ద లీడరు ఏదో ఏదో మాట్లాడుతున్నడు. మూడు గంటల కరెంటు చాలంటున్నడు. 10 హెచ్‌పీ మోటర్ కొనాలంటున్నడు. ఏది పడితే అది, ఎంతస్తే అంత మాట్లాడుతున్నడు. రైతులంటే ప్రేమున్నోళ్లు గిట్ల మాట్లాడరు. ఇగ వీళ్లే గెలుస్తరని అనుకుంటున్నరు. రైతులెవ్వరూ వీళ్లకు ఓటెయ్యరు. వీళ్లకు బుద్ధి చెప్పేతందుకే చూస్తున్నరు. నాలుగు రోజులు ఆగితే వీళ్ల ఉరుకుడంతా ఆగిపోతది. సీఎం కేసీఆర్ వచ్చినంక పంటల విస్తీర్ణం పెరిగింది. ఒక్క పంట తీసేకాడ మూడు పంటలు కూడా తీస్తున్నరు. ఎవుసం దండుగ అని పట్నాలకు పోయినోళ్లు, మళ్లీ తిరుగొచ్చి ఎవుసం పండుగ లెక్క చేసుకుంటున్నరు. మరి కేసీఆర్ సారును ఎందుకు కాదనుకుంటరు. ఆయనే మళ్లీ గెలుస్తుండు. మళ్లీ సీఎం అయితుండు. మూడో తారీఖు రిజల్ట్ అదే.

**- రామిడి మహేశ్, రైతు, తర్లపాడు**



### ❖ ట్రాక్టర్ పని బంద్ వెట్టుడే అయితది..



సోన్, నవంబర్ 25: నాకున్న పంట భూమిలో వరి సాగు చేస్తున్న. 24 గంటల కరెంటుతో ఆటోమెటిక్ స్టాటర్ ఆన్ చేసి ఇంటి వద్ద ఖాళీగా ఉండకుండా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనులు చేసుకుంటున్న. ఏమి చక్కగా మోటరు చాలు చేసి వస్తే అదే నీరు పారుతుంది. కానీ 3 గంటల కరెంటు గ కాంగ్రెసోళ్లు అంటున్నారటా. ఇగ ట్రాక్టర్ డ్రైవర్ పని బంద్ పెట్టు కొని పంట పొలం దగ్గర కూర్చొని నీరు పారించుకోవాలి. మరి. ఏమో గే కాంగ్రెసోళ్లు గీలా మాట్లాడితే మాకు ఇబ్బందే. అయినా కాంగ్రెసోళ్లు వచ్చేది లేదు.. సచ్చేది లేదు. వాళ్లు గిప్పుడే ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నరు. ఇగ ఫ్రీ కరెంటు ఇయ్యకుండా, మోటర్లకు మీటర్లు పెడుతమని కూడా అంటరు. వీళ్లను నమ్మేది లేదు.

**- కొప్పుల నరేశ్, రైతు, వెంగ్వాపేట్**

### ❖ నిమిషాలల్లో పనులైపోతున్నయ్..



నిర్మల్ టౌన్, నవంబర్ 25 : తహసీల్ కార్యాలయాల్లో ఇప్పుడు పనులన్నీ తొందరగైతున్నయ్. భూముల వివరాలు ఏవడిగినా అధికారులు కూర్చొండబెట్టి పని చేసి పెడుతున్నరు. గతంలో గిట్ల లేకుండే. కాంగ్రెసోళ్లతోటి ఇబ్బందైతది. మళ్లీ పట్వారీ వ్యవస్థ తెస్తే మొదటికే మోసం వస్తది. ధరణిని రైతుల కోసమే ప్రభుత్వం తెచ్చింది. గిప్పుడు ధరణిని కూడా బంగాళాఖాతంలో కలిపేస్తమంటున్నరు. వాళ్లను నమ్మం. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి చోటే లేదు. వాళ్లు ఢిల్లీకి గులాం చేస్తరు. మన ప్రజలకేం మంచి చేస్తరు. ధరణి తీసేస్తమని పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడడం సరికాదు. ధరణిని తీసేస్తే భూతగాదాలు పెరుగుతాయి.

**-జగదీశ్, రైతు, ఓలా**

### ❖ మూడు గంటలు వద్దు.. మీ పార్టీ వద్దు



నిర్మల్ టౌన్, నవంబర్ 25 : 24 గంటల కరెంటు ఉంటనే పంటలు మంచిగ పండుతయి. లేకుంటే ఎండుతయి. పదేళ్ల కాలంలో కేసీఆర్ ప్రభుత్వం 24 గంటల కరెంటు ఇవ్వడం వల్లే పంటలకు నీళ్ల కొరత ఉండడం లేదు. కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంటు చాలని చెప్పి రైతులను ఆగం చేస్తున్నరు. కాంగ్రెసోళ్ల మాటలు ఎవరూ నమ్మే పరిస్థితి లేదు. మోటర్లు, స్టాటర్లు కాలిపోవడం కాంగ్రెస్ హయంలో ఎన్నోసార్లు చూసినం. గిప్పుడు ఆ పరిస్థితి లేదు. కేసీఆర్ ప్రభుత్వం 24 గంటల కరెంటు ఇవ్వడం వల్ల మాకెలాంటి రంది లేదు. మూడు గంటల కరెంటు వద్దు.. ఆ పార్టీ వద్దని ఊళ్లో అందరూ అంటున్నరు. రైతులకు మంచి చేసే పార్టీ ఏదో అందరికీ తెలుసు. గాళ్లకే ఓటేస్తమని అంతా డిసైడైన్రు.

**- అర్గుల లక్ష్మి, మంజులాపూర్**

# కాంగ్రెస్‌ను నమ్మం..

## చేతిపార్టీ లీడర్లవి దగాకోరు మాటలన్న రైతులు

- మూడు గంటల కరెంట్‌పై ఆగ్రహం
- టెన్ హెచ్‌పీ మోటర్లు వాడాలనడంపై సీరియస్
- ధరణిని బంగాళాఖాతంలో కలపాలనడంపై మండిపాటు
- సీఎం కేసీఆర్‌కే అండగా ఉంటామని స్పష్టం

**కాంగ్రెస్ లీడర్ల మాటల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు గంటల కరెంట్, టెన్ హెచ్‌పీ మోటర్లు, ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామనే వ్యాఖ్యలపై మండిపడుతున్నారు. కాంగ్రెసోళ్లు, గెలిచేది లేదు.. సచ్చేది లేదని ఎద్దేవా చేస్తున్నారు. వీళ్లను నమ్ముకుంటే మోటర్లకు మీటర్లు పెడుతరని, రైతులను మళ్లీ ఆగం చేస్తరని చెబుతున్నరు. మళ్లీ పచ్చని పల్లెల్లో పగలు పెంచుతరని వాపోతున్నారు. రేవంత్ రెడ్డి వ్యవహారశైలి దారుణంగా ఉందని విమర్శించారు. అందుకే పదేళ్లుగా రాష్ట్రంలో 24 గంటల కరెంటుతో పాటు రైతులకు అన్ని వనరులు సమకూరుస్తున్న సీఎం కేసీఆర్‌కే అండగా ఉంటమని చెబుతున్నారు.**

### ❖ ఊకే కరెంటోళ్లకు ఫోన్లు జేసుడైతది..



నిర్మల్ టౌన్, నవంబర్ 25: గిప్పుడు కరెంటు అస్సలు పోతలేదు. ఒక్కో సారి గిట్ల పోయి.. గట్లస్తున్నది. కాంగ్రెసోళ్లు వస్తే ఇగ పోవుడు తెల్వదు.. వచ్చుడు తెల్వదు. అస్సలు దినమంతా ఉంటదా.. ఉండదా కూడా తెల్వదు. ఇగ మళ్లీ పాత రోజుల కథే అయితది. గతంలో కాంగ్రెస్ కరెంటు ఎట్లా ఉండేనో మాకు తెలుసు. ఇగ ఊకే కరెంటోళ్లకు ఫోన్ చేసుడే అయితది. గిప్పుడయితే పరిస్థితి లేదు. 24 గంటల కరెంటు కేసీఆర్ ఇవ్వడం వల్ల పంట మొత్తం ఫుల్‌గా నీళ్లు పారుతున్నయ్. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు 9 గంటల కరెంటు అన్నమాటే గాని ఐదు గంటలు కూడా రాకపోతుండే. ఆ కరెంటుతో రెండెకరాలు కూడా పంటలు పండకపోయేది. ఇప్పుడు పదెకరాల వరకు పంటలు పండుతున్నయ్. రైతు బతుకు బాగుపడుతున్నది. కాంగ్రెసోళ్లు కరెంటుపై ఏమేమో మాట్లాడుతున్నరు. వీళ్ల మాటలు వింటుంటే ఏదో డౌటు కొడుతాంది. అందుకే వీళ్లకు ఓటెయ్యొద్దు. ప్రజలకు మంచి చేసే లీడర్లకే వెయ్యాలె. అందుకే కేసీఆర్ నే సీఎం గా గెలిపించుకోవాలె.

**- ఎగ్గం గణేశ్, రైతు ఓలా**

### ❖ మళ్లీ చెప్పలరిగేలా తిరగాలె..



సారంగాపూర్, నవంబర్ 25 : ధరణి తీసేస్తే మళ్లీ ఆఫీసుల చుట్టూ చెప్పులరిగేలా తిరగాలె. ఇగ కాంగ్రెసోళ్లు ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తమంటున్నరు. కాంగ్రెస్ లీడర్లకు మాత్రమే ఇగ మంచిగుంటది. రైతులకేం మంచి జరుగుతది. వాళ్లు దళారీ రాజ్యం తెస్తరు. ఏ చిన్న పని కావాలన్నా వాళ్ల చుట్టూ ప్రదక్షిణలు చెయ్యాలె. ఇగ అధికారులు ఏం చెబితే అదే వినాలె. ఇంతకుముందు వాళ్ల పాలనల జూసినం కదా. ఎసొంటి ఇబ్బందులువడ్డమో అందరికీ యాదున్నది. అందరికీ తెలుసు. ధరణి వచ్చినంక పని ఈజీగా అయిపోతున్నది. అంత నమ్మకముంటున్నది. ధరణిని కాదు.. ఈ కాంగ్రెసోళ్లను బంగాళాఖాతంలో కలుపుదామని రైతులంతా అనుకుంటున్నరు. వాళ్లంతా కేసీఆర్‌కే జైకొడుతున్నరు. ఊళ్లల్ల మొత్తం ఇదే టాక్ వినిపిస్తున్నది.

**- బిక్కు సాయన్న, రైతు, ధని**

### ❖ దళారుల రాజ్యం తెస్తరంట..



సారంగాపూర్, నవంబర్ 25 : ధరణి వచ్చినంక దళారులు లేకుండా సమస్యలు పరిష్కారమైతున్నయ్. కాంగ్రెస్ హయాంల రెవెన్యూ ఆఫీసుల చుట్టూ తిరుగుతుంటిమి. అప్పట్లో దళారుల హవా బాగా నడిసేది. వారు చెప్పిందే సారోళ్లు చేసేటోళ్లు. ధరణి వచ్చినంక రైతులు నేరుగా అధికారులను కలిసి పనులు చేస్కుంటున్నరు. రైతులకు భూ సమస్యలు రావొద్దంటే ధరణి ఉండాల్సిందే. గతంలో మనమంటే గిట్లనోళ్లు రెవెన్యూ ఆఫీసుల ఓ దరఖాస్తు పెడితే రిజిస్ట్రేషన్ కాకుండా ఆపెటోళ్లు. ఎంతో ఆలోచించి అందరి మంచికోరి సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం చాలా మంచిది. దీన్ని మేమంతా స్వాగతిస్తున్నం. కాంగ్రెసోళ్లు అధికారంలోకి రానికెై ఏవో వంకలు పెట్టాలని ధరణిపై నిందలు వేస్తున్నరు. ఏది ఏమైనా ధరణి మాత్రం కొనసాగించాల్సిందే.

**- పెద్దొల్ల పోతన్న, రైతు, ధని**

### ❖ అవసరమున్నప్పుడు నీళ్లు పెట్టుకుంటున్న..



సారంగాపూర్, నవంబర్ 25 : కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పిన మూడు గంటల కరెంటిస్తే రైతులంతా మళ్లీ ఇబ్బంది పడుడే అయితది. గత పదేండ్లలో కరెంట్ సమస్యతో రైతులు రోడ్డెక్కిన ఘటనలు ఒక్కటీ లేవు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేది. విద్యుత్ సరఫరా ఆగిపోయి పంటలకు నీరందక ఎండి పోయేది. ఇగ కరెంటియ్యాలని రోజూ లొల్లే. అసలు పట్టించుకునేటోడే లేకుండే. లో వోల్టేజీతోటి మోటర్లు కూడాకాలిపోయేటివి. గిప్పుడు మోటర్లకు నిరంతర కరెంట్ ఇస్తున్నరు. నేనే నాకున్న భూమిలో వరి, పత్తి పంటలు చేస్తున్న. మోటర్‌తో నాకు అవసరమైనప్పుడు నీళ్లు పెట్టి పొలాన్ని తడుపుతున్న. దిగుబడి కూడా పెరిగింది. కాంగ్రెస్ నాయకుల గారడి మాటలు రైతులు నమ్మే పరిస్థితి లేదు.

**- బోనగిరి లక్ష్మణ్, రైతు, ధని**